
సేవ్ కప్పట్రాళ్ల..!

కర్నూలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కప్పట్రాళ్ల.. ఈ పేరు వినగానే గుర్తుకొచ్చేది బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన పాలేగాళ్ల పౌరుషం. అలాంటి పల్లె యురేనియం ముప్పును ఎదుర్కోబోతోంది. గ్రామం అనుకొని ఉన్న కౌలుట్లయ్యమల (కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్ట్)లో యురేనియం నిక్షేపాలు ఉన్నాయని ఇప్పటికే ప్రాథమికంగా గుర్తించారు. ఏ మోతాదులో ఉన్నాయి..? భూగర్భంలో ఎంత లోతులో ప్రాణాంతక మూలకం నిక్షిప్తమై ఉంది..? తెలుసు కోవడానికి 68 భారీ బోర్లు డ్రిల్లింగ్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇక్కడ అణు నిల్వలు గుర్తించి తవ్వకాలకు శ్రీకారం చుడితే పచ్చని పల్లెసీమ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారే ప్రమాద ఉంది. అందుకే.. తమ ఊరిలో యురేనియం తవ్వకాలు వద్దంటూ ఆ పల్లె జనం ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

కప్పట్రాళ్ల కౌలుట్లయ్యమల అనుకొని పచ్చని పంట పొలాలు



దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామ పరిధిలో 468.25 హెక్టార్లు, చెల్లెలిచెలిమల గ్రామం పరిధిలో 618 హెకార్లు, నల్లచెలిమల గ్రామం పరిధిలో 759, హెక్టార్లు, గుండ్లకొండ గ్రామం పరిధిలో 762.2 హెక్టార్లు కలిపి 2,607.45 హెక్టార్లలో అటవీ శాఖ భూములు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తోంది. కప్పట్రాళ్ల గ్రామం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాన్ని కౌలుట్లయ్యమల అంటారు. ఎందుకంటే ఆ ప్రాంతంలో కౌలుట్లయ్యస్వామి ఆలయం వెలసింది. అందుకే పేరు వచ్చిందని స్థానికులు అంటున్నారు. క్రీ.శ. 1800 ప్రాంతంలో కప్పట్రాళ్ల కేంద్రంగా పాలెగాళ్ల పాలన సాగింది. ఎంతో ఘనత చరిత్ర సొంతం చేసుకున్న కప్పట్రాళ్ల గ్రామం తాజాగా యురేనియం ముప్పును ఎందుర్కోబోతోందని తెలిసి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ సర్వేలు జరిగితే గోల్డ్ మైన్ సర్వేలు చేస్తారని అనుకున్నారు. గుట్టుగా అధ్యయనం చేయడమే కాకుండా.. ఏం చేస్తున్నారో అధికారులు గ్రామస్తులకు నాడు చెప్పకపోవడంతో తమకేమి కాదులే అనుకున్నారు. అయితే.. ఆనాడు ప్రాణాంతక మూలకం యురేనియం కోసం సర్వేలు చేశారని ఇప్పుడిప్పుడే గ్రామస్తులు తెలుసుకుంటున్నారు. ప్రమాదకరమైన అణు ధార్మిక పదార్థాల తవ్వకాలు చేపట్ట వద్దని కోరుతున్నారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా పాలకులు ఏ నిర్ణయం తీసుకున్నా ఊళ్లు వదలాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ప్రజల ఆవేదనకు అర్థం లేకపోలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడప జిల్లా వేముల మండలం తుమ్మలపల్లె వద్ద యురేనియం ప్లాంట్లు ఏర్పాటు చేశారు. భూగర్భంలో ఉన్న యురేనియం వెలికితీసి శుద్ధి చేస్తున్నారు. అణు ధార్మికతతో తుమ్మలపల్లె సహా కేకే కొట్టాల, మొబ్బుచింతపల్లె, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె గ్రామాల్లో మానవ విధ్వంసం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్న కరువు పల్లెసీమల్లో జీవ, వృక్షజాతి మనుగడను ప్రశ్నార్థకంగా మార్చే ఇలాంటి చర్యలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

యురేనియం సహజ గుణం

యురేనియం భూమిలో ఉన్నంత వరకు ఎలాంటి ప్రమాదం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. భూగర్భం నుంచి వెలికితీసిన తరువాత ఆక్సిజన్‌తో చర్య జరిగాక అణుధార్మిక శక్తి గల గామా కిరణాలు 30 సెంటీ మీటర్ల కాంక్రీట్‌ను కూడా విచ్చినం చేసేంత శక్తివంతంగా విడుదలవుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్లనే యురేనియం తవ్వకాలు చేపట్టరాదని, ఇప్పటికే చేపట్టి ఉంటే వాటిని నిలిపివేయాలని మేధావులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

కప్పట్రాళ్ల గ్రామం



- మా గ్రామంలో యురేనియం తవ్వకాలు వద్దు
- ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్న జనాలు
- భవితవ్యం ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన
- కలుషితం కానున్న భూగర్భ జలాలు
- హంద్రీ, తుంగభద్ర నదులపై ప్రభావం

మిగతా 6లో..

కప్పట్రాళ్ల పాలెగాళ్ల పౌరుషం:

కప్పట్రాళ్లకు ఎంతో చరిత్ర ఉంది. కృష్ణదేవరాయల కాలంలో జిల్లాలో 20 మందికి పైగా పాలెగాళ్లు ఉన్నారని చరిత్ర. అందులోనూ పంచపాళ్యాలు మరీ బలమైనవి. పత్తికొండ, కోటకొండ, కప్పట్రాళ్ల, దేవనకొండ, మద్దికెర. ఈ ఐదు వంశాల మూలపురుషులు ఒకరేనంటారు. ఆ సమయంలో పరప్పనాయుడు కోటకొండను పాలించారు. ప్రస్తుతం పి.కోటకొండ గ్రామంగా ఉంది. ఆనాడు కప్పట్రాళ్ల కోటను తలుచుకుంటేను శత్రువుల వెన్నులో వణుకు మొదలయ్యేది. అంత బలంగా నిర్మించుకున్నారు. పాలెగార్ చోట మాదప్ప చరిత్రను ఈ నాటికి చెప్పుకుంటున్నారు. హైదర్ అలీ దండయాత్ర తరువాత కప్పట్రాళ్లకు మాదప్ప పూర్వవైభవం తీసుకొచ్చారు. ఆనాటి పాలెగాళ్ల పౌరుషానికి గుర్తులుగా శిథిలమైన కోటగోడలు, నాడు ప్రజల దాహం తీర్చేందుకు తవ్వించిన బావులు చెరగని ముద్రగా ఈనాటికి ఉన్నాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ పల్లె సమీపంలో ప్రాణాంతక యురేనియం తవ్వకాలు చేపడితే చరిత్ర కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు అంటున్నారు. అలాగే.. కౌలుట్లయ్యమలగా పేరుగాంచిన కౌలుట్లయ్యస్వామి క్షేత్రానికి ముప్పు తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కప్పట్రాళ్ల గ్రామంలో పాలెగాళ్ల పాలనలో నిర్మించిన పురాతన బావి

న్యూస్ బాక్స్

పోటీ పరీక్షల పుస్తకాలు ఉంచండి

కలెక్టర్ రాజకుమారి



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి: గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమయ్యే ఆధునిక పుస్తకాలను అందు బాటులో ఉంచాలని కలెక్టర్ రాజకుమారి గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి లైబ్రేరియన్‌ను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పద్మావతీనగర్ లోని పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి గ్రంథాలయాన్ని తనిఖీ చేసి గ్రంథాలయంలో కంప్యూటర్ సిస్టంలను కూడా ఏర్పాటుచేసుకోవాలని, గ్రంథాలయ భవనానికి మరమ్మతు చేయించాలని ఆదేశించారు. అనంతరం బస్టాండు దగ్గరలో గల విక్టోరియా రీడింగ్ రూమ్‌ను కూడా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ రీడింగ్‌రూమ్ ఎప్పుడు స్థాపించిందీ, బైలాస్‌లోని అంశాలు అందజేయాలని నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డిని ఆదేశించారు. కలెక్టర్ వెంట నంద్యాల మున్సిపల్ కమిషనర్ ఉన్నారు.

ప్రభుత్వం మారినా రంగు మారలేదు



వైసీపీ రంగులతో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

కొలిమిగుండ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై వైసీపీ రంగులు మారలేదు. గత వైసీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి నిర్మాణాలపై వైసీసీ రంగులు, బొమ్మలు ముద్రించేవారు. కొలిమిగుండ్ల మండలంలోని మీర్జాపురం గ్రామంలో ప్రభుత్వం నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌పై వైసీపీ రంగులు వేశారు. ప్రభుత్వం మారినా ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌పై రంగులు తొలగలేదు. అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


శ్రీశైలం ఈవో బదిలీ



శ్రీశైలం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజును బదిలీ చేస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైలం ఇన్‌చార్జి ఈవోగా దేవస్థానం సహాయ కమిషనర్ ఇ. చంద్రశేఖరరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. కాగా రెవెన్యూ శాఖ డిప్యూటీ కలెక్టర్ హోదాలో డిప్యుటేషన్‌పై డి.పెద్దిరాజు శ్రీశైలం దేవస్థానం ఈవోగా కొనసాగుతున్నారు. ఆయనను మాతృశాఖలో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీశైలం జలాశయం ఒక గేటు ఎత్తివేత


- ఇన్‌ఫ్లో 1,12,337, ఔట్‌ఫ్లో 95,608 క్యూసెక్కులు
- కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి



శ్రీశైలం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం భారీగా కొనసాగుతోంది. జలాశయం నీటిమట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో శుక్రవారం డ్యాం అధికారులు ఒక క్రస్టుగేటు పది అడుగులమేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్ జలాశయానికి నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 83,547 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 42,420 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 250 మొత్తం 1,26,217 వరద నీరు వస్తోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 1,12,337 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత పూర్తి స్థాయి నీటి మట్టం 884.60 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.4011 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 30,817 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 36,900 క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. క్రస్టుగేటు ద్వారా 27,891 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

అనుమతులు లేకుండా పనులు ఎలా చేస్తారు?

- తహసీల్దార్‌ను నిలదీసిన ప్రజలు



పైపాలెం గ్రామ గెజిట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మిడుతూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని నాగలూటి పైపాలెం గట్టుపై సోలార్ పనులు గ్రామస్తుల అనుమతులు లేకుండా ఎలా చేస్తారని పైపాలెం గ్రామ పెద్దలు, గ్రామస్థులు తహసీల్దార్ శ్రీనివాసులు ప్రశ్నించారు. శుక్రవారం ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు నిలిచిన సోలార్ పనులు చేపట్టాలని తహసీల్దార్ పైపాలెం గట్టు దగ్గరకు చేరుకుని సోలార్ అధికారులకు అనుమతులు ఇచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు 2002లో తమ గ్రామం రెవెన్యూ గెజిట్ చేయడం జరిగిందని, మా గ్రామ అనుమతులు లేకుండా ఎలా పనులు చేస్తారని తహసీల్దార్‌ను నిలదీశారు. తహసీల్దార్ స్పందించి ఈ విషయాన్ని ఉన్నధికారుల దృష్టికి తీసుకెళ్తానని గ్రామస్తులకు చెప్పారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు పక్క గ్రామాల్లో సోలార్ పనులు చేసుకోవాలని సోలార్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ జహంగీర్ బాషా. వీఆర్వో సుందర రాజు, సంజీవ, గ్రామపెద్దలు నాగేశ్వర రెడ్డి, జగన్‌మోహన్ రెడ్డి, రామలింగేశ్వర రెడ్డి, శివమూర్తి, లక్షన్న, వెంకటేశ్వర్లు, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పంటలపై తుఫాన్ ప్రభావం

- మొలకెత్తిన మొక్కజొన్న గింజలు
- రైతుల ఆవేదన

చాగలమర్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల మండలంలోని రైతులు దిగుబడులను కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మొక్కజొన్న ధాన్యం కుప్పలపై పట్టలు క ప్పి ఉంచారు. వర్షం కారణంగా పట్టలపై నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నీరు అధికంగా నిలిచి ధాన్యం తడుస్తుందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలు చేతికొచ్చాక వర్షార్పణం అవడంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఒక వైపు పొలాల్లోని పంటలు మునిగి నష్టపోతే మరో వైపు చేతికొచ్చిన మొక్క జొన్న దిగుబడులను అరబెట్టుకొని అమ్ముకునేందుకు సిద్ధమైన వేళ అకాల వర్షాలు రైతులకు తీరని నష్టం మిగిల్చాయి. పెద్దబోదనం, మద్దూరు, శెట్టివీడు, గొడిగనూరు, చక్రవర్తుల పల్లె, చాగలమర్రి తదితర గ్రా మాల రైతులు రోడ్లపై అరబెట్టుకున్న మొక్క జొన్న గింజలు తడిచి మొలకెత్తడంతో మొక్క జొన్న రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. క్వింటం రూ. 2,300 పలుకుతున్న మొక్కజొన్న రూ.1,500ల కు పడిపోయింది. మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు వ్యాపారులు కూడా ముందుకు రావడం లేదని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



చాగలమర్రి సర్వీసు రహదారిలో తడిచిన మొక్కజొన్న ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

మొలకెత్తుతున్న ధాన్యం

రుద్రవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం మండలంలో శుక్రవారం మధ్యాహ్నం వర్షం కురిసింది. మండలంలోని పందిళ్లపల్లె, పెద్దకంబలూరు, రుద్రవరం, అప్పనపల్లె , పలు గ్రామాల పరిధిలో మొక్కజొన్నలు తడిసిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్నలు మొలకెత్తుతున్నాయని వాపోయారు. సుమారు 500 క్వింటాళ్లు మొక్కజొన్నలు తుడిసి ముద్దయ్యాయి.

మహానందిలో భారీ వర్షం

మహానంది, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):మహానందిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మండలంలో రైతులు సాగు చేసే మొక్కజొన్న ప్రధాన రహదార్లపై ఆరపెట్టుకొన్నారు. ఆకస్మాత్తుగా వర్షం కురియడంతో పంట తడిసి పోయింది. గ్రామాల్లోని ప్రధాన వీధులన్నీ జలమయం అయ్యాయి. మహానందీశ్వరుని దర్శనం కోసం వచ్చిన భక్తులు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. గత నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం వల్ల మండలంలో అరటి తర్వాత రైతులు అధికంగా సాగు చేసే వరి పంటకు అపార నష్టం చేకూరింది. వరిపంట నేలవాలింది. నష్టపోయిన పంటలకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.



మహానంది మండలం బొల్లవరంలో నేలవాలిన వరి పంట



పెద్దకంబలూరులో తడిచిన మొక్కజొన్న ధాన్యం

రూ.2 లక్షలు నష్టం



మూడేళ్లుగా వర్షాభావం, వాతావరణం పరిస్థితులు అనుకూలించక, పంటలు సరిగా పండక ఇబ్బందులు పడ్డా. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంట నూర్పిడి చేసి ఆరబెట్టా. ధాన్యం ఆరితే అమ్ముకొని సొమ్ము చేసుకోవచ్చని ఎంతో ఆశతో ఉన్నాను. అనుకోకుండా వచ్చిన తుఫాన్ వల్ల ధాన్యం తడిసి మొలకెత్తింది. రూ.2 లక్షలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

- బాలకృష్ణ, కౌలు రైతు, చాగలమర్రి

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకున్న మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. పంట దిగుబడిని గృహంలోనే ధాన్యం ఆరబెట్టాను. ధర లేక పోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేవిధంగా లేదు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టా. రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లింది. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలి.

- రమాదేవి, మహిళా రైతు, శెట్టివీడు

హోంగార్డుల పిల్లలకు ప్రోత్సాహకాలు



విద్యార్థికి చెక్కును అందిస్తున్న ఎస్పీ

నంద్యాల క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ చూపిన హోంగార్డుల పిల్లలకు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రోత్సాహక చెక్కులు అందించారు. 2023-2024లో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో 80 శాతం, అంతకంటే ఎక్కువ మార్కులు వచ్చిన 26 మంది హోంగార్డుల పిల్లలకు ఎస్పీ శుక్రవారం కొందరికి రూ.2 వేలు, మరికొందరికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహక చెక్కులను జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు నాగభూషణం, మంజునాథ్ పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల జిల్లాలో హోంగార్డుగా పనిచేస్తూ అనారోగ్య కారణాల వల్ల మరణించిన ఎస్ఎండీ హుసేన్ కుటుంబానికి ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా రూ.2 లక్షల చెక్కును అందించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో తోటి హోంగార్డులతోపాటు కర్నూలు జిల్లాకు చెందిన హోంగార్డులు అందరూ కలిసి హుసేన్ కుటుంబానికి బాసటగా నిలవాలనే ఉద్దేశంతో రూ.2 లక్షల చెక్కును ఎస్పీ చేతుల మీదుగా మృతుడి భార్య షేక్ షహీనకు అందించారు. కార్యక్రమంలో హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్, ఏఎస్పీ ఎన్.యుగంధర్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు నాగభూషణం, మంజునాథ్ పాల్గొన్నారు.

శిలలపై శిల్పాలు

సహజ సిద్ధంగా ఏర్పాటైన రాతి వనాలు

విచిత్ర ఆకృతులతో ఆకట్టుకుంటున్న వైనం

సినిమా షూటింగ్‌లకు సైతం ప్రసిద్ధి

ఓర్వకల్లు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): అక్కడ శిలల కోసమే ఆ ఊరిని ఎవరో కట్టించారా అనిపిస్తుంది. సహజ సిద్ధమైన అందాల రాతివనం అది. ఎర్రకొండల్లో భాగమైన ఈ ప్రాంతం కర్నూలు నగరానికి 20 కి.మీ. దూరంలో ఓర్వకల్లు పట్టణానికి రెండు కి.మీ. సమీపంలో ఉంది. జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. అక్కడికి కుటుంబ సమేతంగా ఉదయాన్నే వెళ్లి పొద్దుగూకే వరకు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందించవచ్చు. వాటర్ టవర్, గుడిసెలు, రెస్టారెంట్లు, స్టోర్ రూం సౌకర్యాలను పర్యాటక శాఖ కల్పించింది. ఉలి దెబ్బ పడితే శిల శిల్పంగా మారుతుంది. జీవం పోసుకుని పలువురిని ఆకట్టుకుంటుంది. కానీ ఒక ఉలి దెబ్బ పడకుండానే ఏ శిల్పి చెక్కకుండానే ఆరేడు కి.మీ. పొడవునా కొలువుదీరిన అపురూప శిల్ప సౌందర్యం ఇది. ఓర్వకల్లు సమీపంలోని ఈ రెండు కొండల మధ్య రాతి వనాలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సెలవు రోజుల్లో పర్యాటకులతో ఈ ప్రాంతమంతా కిటకిటలాడుతుంది. రెండు కొండల నడుమ ఎర్రటి రాళ్లు, పచ్చని మొక్కలు, చల్లగా వీచే గాలులు సందర్శకులను మరో ప్రపంచంలో విహరింపజేస్తున్నాయి. పర్యాటక శాఖ ఆహారం, విశ్రాంతికి అవసరమైన సౌకర్యాలను కల్పించింది. పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 ప్రవేశ రుసుం వసూలు చేస్తారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అనుమతి ఇస్తారు. అయితే పర్యాటకుల కోసం కొండపై రోడ్లు వేశారు. రెండు కొండల మధ్య వంతెను ఏర్పాటు చేశారు. పర్యాటకులకు పున్నమి రెస్టారెంటు అన్ని ఏర్పాట్లు చేసింది.



ఏ భయం లేదు.. ఇలా నడిచేకొద్దీ రాటుతేలిన రాతి సిపాయిలు దారి పొడవునా రక్షణగా నిలబడి ఉంటారు



రెండు గుట్టల మధ్య వంతెన, మధ్యలో లింగమయ్య చెరువు



చిన్ని కృష్ణుడు గోవర్ధనగిరిని చిటికెన వేలుతో ఇలాగే ఎత్తాడేమో.. కాకపోతే ఇక్కడ చిటికెన వేలుకు చూపుడు వేలు జత చేసినట్లుండే దృశ్యం

పర్యాటకులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం



పున్నమి రెస్టారెంటుకు వచ్చే పర్యాటకులకు ప్రభుత్వం ద్వారా అన్ని వసతులు కల్పిస్తున్నాం. సెలవు దినాల్లో రాతి వనాలు పర్యాటకులతో నిండిపోతాయి. కర్నూలు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చి ఈ రాతి వనాలను తిలకిస్తారు. పున్నమి రెస్టారెంటు ఆధ్వర్యంలో 30 రూములు కూడా ఉన్నాయి. ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం.

- జీవన్‌జాయ్, ఏపీ టూరిజం యూనిట్ మేనేజర్





రాతి వనాల్లో తీసిన సినిమా షూటింగ్‌లు

రాతివనాల పరిసర ప్రాంతాల్లో తీసిన సినిమాలు విజయం సాధించడంతో సినీ నిర్మాతలు ఇటువైపు దృష్టి సారించారు. ఇటీవల ఈ ప్రాంతంలో టక్కరిదొంగ, జయం మనదేరా, ఆది, శంభో శివశంభో, సుభాష్ చంద్రబోస్, బాహుబలి సినిమాలు చిత్రీకరించారు. కన్నడ, తమిళం, తెలుగు సీరియల్స్ కూడా ఈ ప్రాంతంలో తీశారు.



రాక్ గార్డెన్‌లో రాతి వనాలు

పనులు ఎందుకు చేయడం లేదు?

● అంగన్‌వాడీ కేంద్రాలలో టాయిలెట్ల నిర్మాణ పనులు పూర్తి చేయండి ● కలెక్టర్ రాజకుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి : జిల్లాలో 439 అంగన్‌వాడీ కేంద్రాల్లో 231టాయిలెట్లు, 425 తాగునీటి పైప్‌లైన్లో ఏర్పాటుకు ప్రభుత్వం 1.55 కోట్ల రూపాయలను విడుదల చేసిందని నిర్మాణ పనులు పూర్తి చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని కలెక్టర్ రాజకుమారి ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్‌ఐసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓ లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ గత సమావేశంలో 15రోజుల్లో పని పూర్తిచేయాలని లక్ష్యాన్ని కేటాయించినప్పటికీ 25శాతం కూడ ఎందుకు పూర్తిచేయలేకపోయారని అడిగారు. అంగన్‌వాడీ కేంద్రాలలో క్షేత్ర స్థాయిలో పనులు ఎంత వరకైందీ తాను స్వయంగా పరిశీలిస్తాని అన్నారు. రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ నిర్మాణాల పనులను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు అప్పగించాలని కలెక్టర్ ఐసిడిఎస్ పిడిని ఆదేశించారు.

లింగ నిర్ధారణ నిషేధ బోర్డులు పెట్టండి

జిల్లాలోని 125 అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి, నిషేధ చట్టం నిబంధనల గురించి ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులు, డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని అతిక్రమిస్తే మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు 50వేల రూపాయల జరిమానా, డాక్టర్లు అతిక్రమిస్తే లైసెన్సు రద్దు మొదలైన చర్యలు ఉంటాయని అన్నారు.

రబీ శుభ సూచకమే..

● ప్రారంభంలోనే వర్షాలు.. ● పొలం పనుల్లో నిమగ్నమైన రైతులు



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు కొంత మేర అధిక వర్షాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో నాలుగున్నర లక్షల హెక్టార్లలో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. వివిధ కారణాల వల్ల సాగు విస్తీర్ణం తగ్గింది. నాలుగు లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. గత సంవత్సరంతో పోలిస్తే.. ఈసారి పంట దిగుబడులు బాగానే ఉంటాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లోలాగే ప్రస్తుత రబీలోనూ ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రబీ సాధారణ సాగు విస్తీర్ణం 1,17,287 హెక్టార్లు కాగా, ఇప్పటికే 5వేల హెక్టార్లలో పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ప్రధానంగా పప్పుశనగ పంట 69,038 హెక్టార్లలో సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే వేయి హెక్టార్లలో ఈ పంట సాగైనట్లు వారు గుర్తించారు. వరి 4,440 హెక్టార్లు, జొన్న 10,080 హెక్టార్లు, సజ్జ 770 హెక్టార్లు, మొక్కజొన్న 6,069 హెక్టారుల, కొర్ర 1,242 హెక్టార్లు సాగవుతుందని అధికారులు చెప్పారు. కందులు 132 హెక్టార్లు, పెసలు 35 హెక్టార్లు, మినుములు 731 హెక్టార్లు, వేరుశనగ 15,449 హెక్టార్లు, పొద్దుతిరుగుడు 376 హెక్టార్లు, ఆముదం 129 హెక్టార్లు, వాము 1,616 హెక్టార్లు, పొగాకు, 1743 హెక్టార్లు, మిరప 810 హెక్టార్లు, ఉల్లి 2,350 హెక్టార్లు పంటలు సాగు చేసే అవకాశం ఉందని జేడీ వరలక్ష్మి తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి అక్టోబరులో 40.4 ఎంఎం వర్షం కురవాల్సి ఉండగా.. ఇప్పటికే 66.2 ఎంఎం వర్షం నమోదైంది. అదే విధంగా నవంబరు, డిసెంబరు నెలల్లో కూడా వర్షాలు నిర్ణీత సమయంలో కురిస్తే రబీ సీజన్ నుంచి గట్టెక్కుతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీకి పెరిగిన దసరా ఆదాయం

కర్నూలు(రూరల్)అక్టోబరు18: దసరా పర్వదినం పురస్కరించుకొని ఆర్టీసీకి ఆదాయం పెరిగినట్లు కర్నూలు జిల్లా డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజరు కె.సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగకు దూరప్రాంతాల నుంచి స్వంత గ్రామాలకు వచ్చే ప్రయాణికుల కోసం ఈనెల 8నుంచి 11వ తేది వరకు, 13నుంచి 16వ తేది వరకు తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ బస్సులను తిప్పినట్లు ఆమె వివరించారు. మొత్తం 258 ప్రత్యేక బస్సులతోపాటు షెడ్యూల్ బస్సులను ఆదనంగా నడిపినట్లు తెలిపారు. మొత్తం మీద 1.63 లక్షల కిలోమీటర్లు నడిపి 76శాతం ఆక్యుపెన్సీ రేషియోతో రూ.44 ఇపికెతో రూ.72 లక్షలు ఆదాయాన్ని ఆర్జించినట్లు వివరించారు. కాగా గత దసరా పండుగ కంటే ఈసారి పండుగకు రూ.7లక్షలు ఆదనంగా ఆదాయం వచ్చిందని అన్నారు.

మద్యం షాపును అడ్డుకున్న ప్రజలు



ధర్నా చేస్తున్న స్థానికులు

కర్నూలురూరల్ అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం వెంకాయపల్లె వద్ద కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న మద్యం దుకాణాన్ని శుక్రవారం చుట్టుపక్కల గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన మద్యం దుకాణ లాటరీలో కర్నూలు మండలంలో మద్యం షాపును నగరానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన వెంకాయపల్లె వద్ద ప్రధాన రహదారి పక్కన్నే ఉన్న కొత్త షాపును అద్దెకు తీసుకున్నారు. మద్యం షాపును ప్రారంభించే సమయంలో చుట్టు పక్కల ఉన్న సూదిరెడ్డిపల్లె, నందనపల్లె, మిలటరీ కాలనీ, భూపాల్‌నగర్, నందనపల్లె, వెంకాయపల్లె వంటి ప్రజలు ఇక్కడ మద్యం దుకాణం పెట్టారాదని అడ్డుకుని దుకాణం ముందు ధర్నాకు దిగారు. పైగా ఈ షాపింగ్ కాంప్లెక్స్ పసుపులకు చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ పరిపతి సంఘానికి చెందనది అని స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు కేఈ వేమన్నగౌడ్ వివరించారు. కాంప్లెక్స్‌లో మొదట జగదీశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ఈ షాపును పెయింటర్స్, హార్డ్‌వేర్ కోసం అద్దెకు తీసుకొని వైన్‌షాపుదారుడికి సబ్ లీజుకు ఇచ్చారన్నారు. ఈ సొసైటి ప్రభుత్వ అనుసంధానం కింద కొనసాగుతుందని ఆయన గుర్తు చేశారు. సొసైటీ సహకార చట్టం ప్రకారం సబ్ లీజ్‌కు ఇవ్వకూడదన్నారు. గ్రామస్తులతో పాటు సొసైటీ సభ్యులు కూడా ధర్నాలో పాల్గొని మద్యం దుకాణాన్ని పెట్టాడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కేఈ దామోదర్‌గౌడ్, కేఈ. వేణుగౌడ్, లక్ష్మీదేవి, రాము, అబిలాష్, మహేష్, యోగి, చిన్నపరమేష్, మహేంద్ర మహిళలు పాల్గొన్నారు.

సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు ఇవ్వండి

ఎంపీడీవోలను ఆదేశించిన కలెక్టర్



కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాల్లో గత 3 వారాల నుంచి జీరో పురోగతి ఉన్న 25 సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత మండలాల ఎంపీడీవోలను కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి హౌసింగ్, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్ అంశాలపై స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆప్షన్ త్రీ కింద ఉన్న ఇళ్ల నిర్మాణాల గురించి కాంట్రాక్టర్లతో మాట్లాడి త్వరితగతిన ఇళ్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రూఫ్ కాస్ట్ లెవెల్‌లో ఉన్న ఇళ్లను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలన్నారు. వంద రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాల సాధనలో భాగంగా గూడూరు మండలానికి 14 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యం కాగా, నెలలో కేవలం ఒక్క ఇంటిని మాత్రమే 8 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు కలిసి ఒక్క ఇల్లు పూర్తి చేయడమేంటని ప్రశ్నించారు. హాలహర్వి మండలంలో కూడా 116 ఇళ్ల నిర్మాణాలు లక్ష్యంగా కాగా నెలలో కేవలం ఒకటిని మాత్రమే పూర్తి చేశారన్నారు. ఇళ్ల నిర్మాణంలో 90 రోజుల పనిదినాలు కల్పించడంలో ఆదోని, ఓర్వకల్లు, పత్తికొండ, కోసిగి, కౌతాళం, ఎమ్మిగనూరు మండలాల్లో పనిదినాలు కల్పించడంలో పురోగతి లేదన్నారు.

● క్రిష్ణగిరి మండలం వెనుకంజ: ఉపాధి హామీ సంబంధించి పని దినాలు కల్పించడంలో కృష్ణగిరి మండలం అత్యంత తక్కువ పురోగతి 34 శాతం సాధించిందని, 14వేల మంది జాబ్ కార్డులు, హోల్డర్లు ఉన్నప్పటికీ కూడా వేయి మందికి మాత్రమే పనిదినాలు కల్పించడమేమిటని ఎంపీడీవో, ఏపీవోలను ప్రశ్నించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో 4,311 ఎకరాల్లో లక్ష్యాలకుగాను 3,400 ఎకరాలు పూర్తి చేశారని, లక్ష్యాలను కూడా పూర్తి చేయాలన్నారు. రెవెన్యూకు సంబంధించిన రెక్టిఫికేషన్ ఆఫ్ రెవెన్యూ రికార్డులు, యాక్షన్ అగ్రెస్ట్ ల్యాండ్ గ్రాబింగ్, ఎంక్రోచ్‌మెంటు రెగ్యులరైజెషన్ అంశాలపై ఎక్కువ కేసులు వస్తున్నాయని, ఫీల్డ్‌కు వెళ్లి వాటిని చెక్ చేసి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో చిరంజీవి, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

సేవ్ కప్పట్రాళ్ల..!

5వ పేజీ తరువాయి

యురేనియం తవ్వకాలు చేపడితే పచ్చని పంట చేలను ధ్వంసం చేస్తుందని, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. కప్పట్రాళ్ల రిజర్వు ఫారెస్టు ప్రాంతంలో కురిసే వర్షపు నీరు చిన్నచిన్న వంకలు, వాగులు ద్వారా హంద్రీ నదిలో చేరి తుంగభద్ర నదిలో కలుస్తాయి. తుంగభద్ర కృష్ణాలో కలుస్తుంది. యురేనియం తవ్వకాలు చేపడితే.. వాటి వ్యర్థాలు వంకలు, వాగుల ద్వారా హంద్రీ, తుంగభద్ర, కృష్ణా నదుల్లో కలిసే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే జరిగితే రాయలసీమ సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుందని, నదీ జలాలు కలుషితమైతే.. ఆ నీటినే సాగు, తాగునీటికి వినియోగించడం వల్ల తీవ్రమైన నష్టాలు జరుగుతాయని, ఆ నీటితో తడసిన పొలాల్లో విషపు పంటు సాగు చేసినట్లేనని, ఆ నీరు తాగితే మనుషులు, జంతువులు ప్రమాకరమైన రోగాల భారిన పడాల్సి వస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కప్పట్రాళ్ల అడవుల్లో కౌలుట్లయ్య స్వామి ఆలయం

జీవవైవిధ్యం ప్రమాదంలో పడుతుంది



వ్యవసాయమే మాకు జీవనాధారం.. పంట పొలాలే జీవం. యురేనియం తవ్వకాలు వల్ల వ్యవసాయ భూములు దెబ్బతింటాయి. భూగర్భ జలాలు కలుషితం అవుతాయి. అటవీ భూములు, వృక్షజాతులు, జీవవైవిధ్యం ప్రమాదంలో పడుతుంది. ప్రమాదకరమైన యురేనియం తవ్వకాలపై ప్రభుత్వాలు పునరాలోచించాలి. గ్రామస్తులకు నష్టం జరిగే ఏ కార్యక్రమైన ఉమ్మడిగా అడ్డుకుంటాం.

- గంగన్న,కప్పట్రాళ్ల గ్రామం, దేవనకొండ మండలం

నష్టం చేకూర్చే యురేనియం తవ్వకాలు వద్దు



ఎన్నో ఏళ్లుగా కరువు కాటకాలతో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడిప్పుడే బోరు బావులు తవ్వకొని వివిధ పంటలు పండిస్తూ ఆర్థికంగా కోలుకుంటున్నాం. హంద్రీనీవా కాలువ కూడా వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రమాదకరమైన యురేనియం తవ్వకాలు చేపడితే ఊళ్లు వదలాల్సి వస్తుంది. తాగడానికి నీళ్లు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. నష్టం చేకూర్చే యురేనియం తవ్వకాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపట్టరాదు.

- గఫూర్, కప్పట్రాళ్ల గ్రామం, దేవనకొండ మండలం

మద్యం, ఇసుక జోలికి వెళ్లవద్దు

● పారదర్శకంగా ప్రజలకు అందిద్దాం

● సభ్యత్వ నమోదు పకడ్బందీగా నిర్వహించాలి

● ఎంపీ, ఎమ్మెల్యే, ఇన్‌చార్జిలకు సీఎం దిశా నిర్దేశం



విజయవాడలో జరిగిన టీడీపీ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తదితరులు



సీఎం చంద్రబాబు సమావేశంలో పాల్గొన్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆలూరు, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జిలు బి.వీరభద్రగౌడ్, ఎన్.రాఘవేంద్రరెడ్డి

కర్నూలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇసుక.. మద్యం జోలికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు వెళ్లవద్దు.. పారదర్శకంగా ఇసుకను ప్రజలకు అందించాలి.. ఎవరైనా జోక్యం చేసుకొని అక్రమాలకు పాల్పడితే స్వంత పార్టీవాళ్లను కూడా ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు ప్రజా ప్రతినిధులను ఘాటుగా హెచ్చరించారు. ప్రజలకు జవాబుదారిగా ఉండాలని సూచించారు. శుక్రవారం మంగళగిరిలో ఉన్న టీడీపీ కేంద్ర కార్యాలయంలో టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులతో సమావేశం అయ్యారు. ఉమ్మడి కర్నూలు జిల్లా మంత్రుల టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, గౌరు చరిత, ఆదోని, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, బి. వీరభద్రగౌడ్, ఎన్. రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, వారి అనుచరులు ఇసుక, మద్యం దుకాణాల ఏర్పాటులో దందా సాగిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్న నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. కొందరు ఎమ్మెల్యేలు నేరుగా దందాలకు సై అంటున్నారనే ఫిర్యాదులు అధిష్టానానికి, సీఎంవో ఆఫీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారని జిల్లాకు చెందిన ఓ ముఖ్య నాయకుడు పేర్కొన్నారు. అదే క్రమంలో టీడీపీ సభ్యత్వం పకడ్బందీగా చేపట్టాలని అధినేత దిశనిర్దేశం చేశారని వివరించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ సమావేశం జరిగిందని తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఈ బాలచంద్రారెడ్డి



కర్నూలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ల (ఎస్ఈ)గా బి. బాలచంద్రారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో బాలచంద్రారెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్ఏసీ) అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారి చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు రెడ్డి శేఖర్‌రెడ్డి నుంచి బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ సీఈ కబీర్‌బాషాను కలిశారు. జిల్లాలోని ప్రాజెక్టులు, చిన్ననీటి పారుదల చెరువులు, ఎల్లెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టుల పరిధిలోని ఆయకట్టుకు సాగునీటిపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో చేపట్టే ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రక్రియను పూర్తి చేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యా సంవత్సరానికిగాను జిల్లాలోని అన్ని కళాశాలలో చదువుతున్న విద్యార్థులు పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్పులకు రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రిన్సిపాళ్లను సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రంగలక్ష్మీదేవి శుక్రవారం ఆదేశించారు. కొత్త రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయడానికి ఆన్‌లైన్ వెబ్‌సైట్ పోర్టల్ కళాశాల జ్ఞానభూమి లాగిన్‌లో అందుబాటులో ఉంచామన్నారు. నూతన దరఖాస్తులు, రెన్యువల్స్ నమోదు ప్రక్రియను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. ఆయా కళాశాలలో స్కాలర్‌షిప్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.

పంచాయతీ బోరు.. వైసీపీ నాయకుని పొలానికి నీరు

- తాగునీటి ఇబ్బందుల్లో కామన్‌దొడ్డి గ్రామస్థులు

కోసిగి అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): అధికారం పోయినా వైసీపీ నాయకులకు బరితెగింపు మాత్రం తగ్గడం లేదు. ప్రభుత్వ నిధులతో ప్రజల దాహార్తి కోసం వేయించిన తాగునీటి బోరును ప్రజలకు అందివ్వకుండా వైసీపీ నాయకులు తన సొంత పొలానికి కట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. కోసిగి మండల పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు తలారి గోవిందు, సంజీవయ్య, అంజినయ్య ముగ్గురు అన్నదమ్ములకు గ్రామ సమీపంలోని రెండెకరాల పొలం ఉంది. ఆ పొలం పక్కనే ఆర్లబండకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఆరు నెలల క్రితం తాగునీటి బోరు వేయించారు. మూడు ఇంచుల మేర మంచి నీరు పడింది. అయితే.. ఆరు నెలల వరకు మోటారు బిగించకపోవడంతో గ్రామ సర్పంచ్ భర్త నరసింహులుగౌడు ఆదేశాలతో వైసీపీ నాయకులు గోవిందు, సంజీవయ్య, అంజినేయలు ప్రభుత్వ బోరుకు మోటారు బిగించుకుని తమ పత్తి, కంది పంటకు నీటిని వాడుకుంటున్నారు. ఓ వైపు గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్నా సర్పంచ్ తమ పార్టీ నాయకుల పొలాలకు నీరు పారించుకుంటున్నాడు. దీంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు అధికారం అడ్డం పెట్టుకుని ఇలాంటి బరితెగింపు కార్యక్రమాలు ఎన్నో చేపట్టారు. ఇప్పటికీ వైసీపీ నాయకులు అధికారం కోల్పోయినా ప్రజల సమస్యలను గాలికొదిలేసి తమ సొంతానికి నీటిని వాడుకోవడమేంటని కామన్‌దొడ్డి ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగు నీరు లేక ప్రజలు పొలాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ బోరు ద్వారా గ్రామస్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కామన్‌దొడ్డిలో వైసీపీ నాయకుడు పొలానికి ఉపయోగించుకుంటున్న పంచాయతీ బోరు

ప్రజలకు బోరు ద్వారా నీరు అందిస్తాం



గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ప్రభుత్వ బోరును మోటారు బిగించి పొలానికి వాడుకుంటున్నారన్న సమాచారం నా దృష్టికి వచ్చింది. వారిపై చర్యలు తీసుకుని ఆ బోరు ద్వారా గ్రామస్థులకు తాగునీరు అందిస్తాం. **- వెంకటేశ్వర్లు, ఎంపీడీవో**

సీఎంను కలిసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు


సీఎం చంద్రబాబుతో మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులును నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ శుక్రవారం అమరావతిలోని సెక్రటేరియట్‌లో కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, అలాగే త్వరలో ప్రారంభిస్తున్న టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రబాబు చెప్పారని ఆయన తెలిపారు. ఓర్వకల్లు బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కృషి చేసిన సీఎంకు రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. గుట్టపాడు గ్రామాన నూతనంగా నిర్మిస్తున్న జయరాజ్ ఇస్పాత్‌ను రెండు నెలల్లో సీఎం ప్రారంభిస్తారని తెలిపారు.

ఉర్దూ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు, అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద మిగిలిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ల కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ లోక్‌నాథ్ తెలిపారు. ఈనెల 24 వరకు జరిగే ప్రక్రియకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఎంఏ. ఇంగ్లీష్, కంప్యూటర్స్ సైన్సు, బాటనీ, ఎకనామిక్స్ ఎంఎస్సీ ఇండస్ట్రియల్, ఉర్దూ, కోర్సుల్లో చేరే వారు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు.

పురస్కారాలకు దరఖాస్తులు

కర్నూలు కలెక్టరేట్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జాతీయ స్థాయి పురస్కారం, డా.అబ్దుల్ హక్ ప్రాంతీయ స్థాయి పురస్కారానికి ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎస్.పర్వీన్ తెలిపారు. నవంబరు 11న మైనార్టీల సంక్షేమ దినోత్సవం జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఆరుగురికి జీవితకాల సాఫల్య పురస్కారాలు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, ఉత్తమ విద్యార్థి పురస్కారం అందజేస్తామన్నారు.



ఆర్‌యూలో ఆధిపత్య పోరు

- రిజిస్ట్రార్‌గా విజయ్‌కుమార్ నాయుడు బాధ్యతలు
- కనీసం పలకరించేందుకు కూడా రాని ప్రొఫెసర్లు, అధ్యాపకులు
- పాలన గాడి తప్పిందంటున్న విద్యార్థి నాయకులు

కర్నూలు, అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో ఆధిపత్య పోరుతో విద్యార్థులు, ఉద్యోగులు నలిగిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిపాలన ఇన్‌చార్జిల చేతిలోకి వెళ్లింది. ఫలితంగా సీనియర్స్, జూనియర్స్ అనే తేడా వచ్చేసింది. ఫలితంగా అవమానాలు, దాడులు, బూతులు ఇలా రోజుకో ఘటనతో క్యాంపస్ వివాదాస్పదంగా మారింది. కొందరు ప్రొఫెసర్లు ఒకరిపై ఒకరు ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదు చేసుకుంటున్నారు. విద్యాశాఖ మంత్రికి సమాచారం ఇవ్వకుండా గత వైసీపీ ప్రభుత్వంలో పని చేసిన పాలక మండలి సభ్యులతో సంతకాలు చేయించి కోర్టు కేసుతో ముడిపడి ఉన్న 14 అంశాల అనుమతుల కోసం ప్రయత్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇది చర్చకు దారి తీసింది. గత పాలక మండలిలో కొన్ని అంశాలు చర్యలకు ఆదేశిస్తే వాటిని సమర్థిస్తూ నిర్ణయం తీసుకోవడం లాంటి వాటిని ఉదహరిస్తూ ఈ ఆఫీసు పేరుతో ఉన్నత విద్యాశాఖ అనుమతుల కోసం వేచి చూస్తున్నారని, ఇటీవల కొన్ని టెండర్ల దశలోనే అడ్డుకుని వర్సిటీకి మేలు చేశామంటూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి ఓ ప్రొఫెసర్ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది.

వర్సిటీలో వరుస ఘటనలు ఇలా..

వర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా బోయ విజయ కుమార్ నాయుడు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. అయితే వర్సిటీలోని అధ్యాపకులు, ప్రొఫెసర్లు మర్యాదపూర్వకంగా కూడా శుభాకాంక్షలు చెప్పేందుకు రాకపోవడంక్యాంపస్‌లో చర్చనీయాంశమైంది. శుక్రవారం ఉదయం మొక్కుబడిగా ముగ్గురు ప్రొఫెసర్లు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రిజిస్ట్రార్‌ను పలకరించేందుకు వచ్చారు. రిజిస్ట్రార్ చాంబర్లో ముందే వేచి ఉన్న సీనియర్ ప్రొఫెసర్, కళాశాల ప్రిన్సిపాల్ నరసిం హులు.. రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడును పలకరించారు. అంతలోనే సదరు ముగ్గురు ప్రొఫెసర్లు చాంబర్లోకి వచ్చి రాగానే కించపరిచే విధంగా ప్రిన్సిపాల్ నరసింహులును మాట్లాడ టంతో ఆయన అక్కడే కన్నీటి పర్యంతమయ్యారు. ఇలాంటి సంఘటనలు క్యాంపస్‌లో ఎవరి జరగకూడదని, విద్యార్థులకు పాఠాలు బోధించే విశ్వవిద్యాలయంలో ఇలాంటి వివక్ష చూపించడం ఎంత వరకు సమంజసమని ఆయన విద్యార్థుల వద్ద వాపోయారు. గురువారం అర్ధరాత్రి క్యాంపస్ హాస్టల్ గదిలో ఇంజనీరింగ్ విద్యార్థి నిద్రిస్తుండగా సీనియర్ ఇంజనీరింగ్ విద్యార్థులు చొరబడి చావు దెబ్బలు కొట్టడం లాంటి ఘటనలతో విద్యార్థులకు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ సంఘటనపై విద్యార్థి సంఘాలు వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేసుకుంటూ వ్యగ్యంగా చర్చించుకోవడం కనిపించింది. వర్సిటీ ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకుడు రామక్రిష్ణ మాట్లాడుతూ ఒక ప్రిన్సిపాల్ పట్ల వివక్ష చూపడం సరైన పద్ధతి కాదని అన్నారు. క్యాంపస్‌లో పరిపాలన గాడి తప్పిందని, క్యాంపస్ తీరుపై ఉన్నత విద్యాశాఖ దృష్టి సారించకపోవడం దురదృష్టకరమన్నారు. ఇది ఇలా ఉండగా వర్శిటీలో పని చేసే ఉద్యోగులను కాదని యోగి వేమన వర్సిటీ నుంచి రిజిస్ట్రార్‌ను నియమించడంపై కొందరు ప్రొఫెసర్లు అసహనంతోనే ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఎవరూ కలవడం లేదంటూ మరి కొందరు విద్యార్థులు చర్చించుకోవడం కనిపించింది.

దౌర్జన్యంగా మద్యం దుకాణం మూయించారు..

సీఎంకు ఫిర్యాదు చేస్తా: టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కర్నూలు, అర్బన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కోడుమూరు టీడీపీ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి దౌర్జన్యంగా మద్యం షాపు మూయించాడని ఆ పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ అన్నారు. శుక్రవారం నగరంలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్సైజ్ శాఖ నిర్వహించిన లాటరీ ప్రక్రియలో మద్యం షాప్ దక్కించుకున్న వాళ్లకు దుకాణం నడుపుకునే హక్కు లేదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండి.. సీఎం చంద్రబాబు నాయుడు హెచ్చరించినా తమ షాపు బలవంతంగా 30 మంది రౌడీలను పంపించి మూయించారని ఆరోపించారు.

రక్షణ కల్పించండి

- గాంధీ విగ్రహం వద్ద బాధితుల ఆందోళన


గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

డోన్ రూరల్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన న్యాయవాది కృష్ణప్రసాద్ నుంచి రక్షణ కల్పించాలని బాధితులు కోరారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. అనంతరం డోన్ డీఎస్పీ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. బాధితులు సంగుస్వామి రెడ్డి మాట్లాడుతూ డోన్ పట్టణం ఇందిరానగర్‌లో తాము నివాసముంటున్నామ న్నారు. తమకు ఉడుములపాడు గ్రామ సమీపంలో రెండెకరాల 13 సెంట్ల పొలం ఉందని, తమ పొలం పక్కన డోన్ పట్టణానికి చెందిన న్యాయవాది కృష్ణప్రసాద్‌కు కంకర ఫ్యాక్టరీ ఉందన్నారు. కంకర ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుమ్ముధూళితో పంట నాశనమవుతుందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. వీటిని సహించలేక న్యాయవాది కృష్ణప్రసాద్ తన కుమారుడు హరీష్, తమ్ముడి కుమారుడు హరితో కలిసి గత నెల 12వ తేదీన ఓ వాహనంతో నాశనం చేశారని ఆరోపించారు. డీఎస్పీ శ్రీనివాసులు న్యాయవాది కృష్ణ ప్రసాద్ నుంచి రక్షణ కల్పిస్తామని, భవిష్యత్తులో బెదిరింపులకు పాల్పడితే.. నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని భరోసా ఇచ్చారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

- 43 తులాల బంగారు నగలు స్వాధీనం

కర్నూలు క్రైమ్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాలో రెండేళ్లుగా వరుస చోరీలకు పాల్పడుతున్న అల్తాఫ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, తాలుకా సీఐ శ్రీధర్, మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డిలు శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కల్లూరు ఫారుక్‌నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్ అలియాస్ అల్తాఫ్ జులాయిగా తిరుగుతూ గత రెండేళ్లుగా ఈ దొంగతనానికి పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరు నిందితులు మహేష్, బాలకృష్ణలతో కలిసి ఈ చోరీలు చేస్తున్నట్లుగా గుర్తించారు. ఇటీవల పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తే అసలు చోరీలు వెలుగులోకి వచ్చాయి. అల్తాఫ్ కర్నూలులో పెయింటింగ్ పనులు చేస్తూ మిగతా ఇద్దరు నిందితులతో కలిసి రాత్రివేళల్లో తాళం వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడుతుంటారు. కర్నూలు త్రీటౌన్, ఫోర్త్ టౌన్, తాలుకా, నంద్యాల టూటౌన్, తాలుకా పోలీస్ స్టేషన్ల పరిధిలో 36 చోరీల్లో ఈ నిందితులు పాల్గొన్నారు. అల్తాఫ్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 43 తులాల బంగారు నగలు, 279 తులాల వెండి నగలు స్వాధీనం చేసుకున్నారు. మిగతా ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసును చాకచక్యంగా చేధించిన సీఐలతో పాటు ఎస్ఐలు మన్మథ విజయ్, చంద్రశేఖర్ రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కృష్ణ, తులసి, ఖాద్రి, కిరణ్, ఎల్లశివుడును డీఎస్పీ అభినందించారు.

ఈవో సస్పెన్షన్

కర్నూలు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలంలోని బుగ్గ రామేశ్వరం ఆలయంలో జరిగిన భారీ కుంభకోణంలో ఈవో బీఆర్‌కే ప్రసాద్‌ను శుక్రవారం దేవ దాయ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఆయన యాగంటి ఆలయ ఈవోగా పనిచేస్తున్నారు. కాల్వ బుగ్గ రామేశ్వరం ఆలయ ఈవోగా ఉన్న సమయంలో ఆలయ నిధులను సొంత ఖాతాకు మళ్లించి.. ఆ తర్వాత తన బినామీల ద్వారా డ్రా చేసి స్వాహా చేశారని విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. దాదాపు రూ.1.35 కోట్లు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయన బదిలీపై వెళ్లాక ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో దేవదాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు.

ప్రజలతో మమేకమైతేనే సమస్యలు పరిష్కారం

- నేరాల నియంత్రణకు కృషి చేయాలి
- ఎస్పీ బిందు మాధవ్


మూమెంట్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

తుగ్గలి అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలతో మమేకమై పని చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కరించగలమని, నేరాల నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని ఎస్పీ జి. బిందుమాధవ్ అన్నారు. శుక్రవారం తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌స్టేషన్లను వార్షిక తనిఖీల్లో భాగంగా పరిశీలించి తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించడంతో పాటు పోలీస్‌స్టేషన్‌ల ఆవరణలను పరిశీలించారు. అలాగే పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసులు ఉంటే వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని నిందితుల అరెస్టు, దర్యాప్తులు ఎలా చేపడుతున్నారని సీఐలు, ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ముఖ్యమైన కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు విజబుల్ పోలీసింగ్ చేయాలని, అప్పుడే సమర్థవంతంగా కేసులను ఛేదించవచ్చని, నేరాలను తగ్గించవచ్చని అన్నారు. ఎస్పీ వెంట పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య, ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, సీఐలు పులిశేఖర్, ప్రసాద్, ఎస్ఐలు జయశేఖర్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

మహానంది, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని తెలుగగంగ ప్రధాన కాలువలో శుక్రవారం ఇంటర్ విద్యార్థి గౌతమ్ సిదార్థ (17) మృతదేహం లభ్యమైంది. శుక్రవారం రుద్రవరం సమీపంలోని తెలుగు గంగ కాలువ తుండ్లవాగు రిజర్వాయిర్ వద్ద గుర్తించినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పూర్తయ్యాక తల్లితండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

- నిందితుల అరెస్టు, వాహనం సీజ్
- 7,680 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం


మద్యం, వాహనం, నిందితులను చూపుతున్న డీఎస్పీ

డోన్ రూరల్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం వైఎస్ నగర్ పరిసర ప్రాంతంలో భారీగా మద్యం స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బొలేరో వాహనంలో 80 గెలాక్స్ విక్సీబాక్సులలో తరలిస్తున్న 7,680 టెట్రా మద్యం ప్యాకెట్లను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు. నిందితులు ఈడిగ సురేంద్ర (గుడిగుప్పరాళ్ల గ్రామం తుగ్గలి మండలం చెందిన ఈయన ప్రస్తుతం వైఎస్ నగర్‌లో ఉంటూ అక్రమ మద్యం చేస్తూ పట్టుబడ్డారని అన్నారు. ఈయనతో పాటు కృష్ణగిరి మండలం సంగాల గ్రామం హరిప్రకాష్ గౌడు, బీసీ కాలనీ, తుగ్గలి గ్రామానికి చెందిన మునీకంట గౌడు, డోన్, వైఎస్‌నగర్‌కు షేక్ దస్తగిరిలను అరెస్టు చేశామన్నారు. వీటిపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

వెలుగోడు, అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి: మండలంలోని ఉపాది పనులపై శుక్రవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం సంచాలకులు జనార్దన్‌రావు ఎంపీడీవో కార్యాలయం లో సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు వందల రోజులు యాక్షన్‌ప్లాన్, వంద పని దినాలు పూర్తి చేయడం, షోక్‌ఫిట్స్, క్యాటిల్‌షెడ్స్, రుఫ్ వాటర్, స్ట్రక్చర్, పల్లె వనాలు, హౌసింగ్ పంచాయతీరాజ్ పనులపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, పీఆర్‌ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

నంద్యాల రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ పాఠశాలలోని టీచర్ల కొరత తీర్చాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, సుధాకర్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలో సబ్జెక్టుల టీచర్ల కొరత ఎక్కువగా ఉందని, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించి టీచర్ల కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లకు, హెచ్‌ఎం, అర్బన్ ఎంఈవో లకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ కల్పించాలని, బదిలీలు వెంటనే చేపట్టాని, నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే 24న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రామ్‌మోహన్, రామక్రిష్ణుడు, అరవింద్‌కుమార్, కాసీం, బాలస్వామి పాల్గొన్నారు.

తెలుగు ప్రజల ఆతిథ్యం మరువలేనిది

ఎంపీ బైరెడ్డి శబరి



ఆస్ట్రేలియాలోని తెలుగు ప్రజలతో ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్‌లో శుక్రవారం తెలుగు ప్రజలు ఇచ్చిన ఆతిథ్యం మరువలేనిదని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఆస్ట్రేలియాలో స్థిరపడ్డ తెలుగు ప్రజలైన లగడపాటి సుబ్బారావు, గోపినంబాల, కొణిదేన శ్రీకాంత్, తాతినసుమ, దాసరిసుమన్, సూరపనేని ప్రకాష్, జొన్నలగడ్డ నర్మద్, విషర్ల నితిన్ తదితరులు తన కుటుంబ సభ్యులకు ఆతిథ్యం ఇచ్చి గౌరవించడం గొప్ప అనుభూతిగా నిలుస్తుందని అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉమ్మడి ప్రభుత్వ విజయానికి తమ వంతు పాత్ర పోషించిన ఆస్ట్రేలియా తెలుగు ప్రజలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పశు వైద్యశాల శిథిలం

● పట్టించుకోని అధికారులు ● భయాందోళనలో పశు వైద్యాధికారులు, సిబ్బంది



కొత్తపలి, అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి: మండలంలో పశువైద్యశాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నపాటి వర్షానికే కారుతున్నదని, దీంతో ఆసుపత్రిలో ఉన్న మందులు తడిపోతున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు. కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామ శివారులో నిర్మించిన పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. భవనం ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అయితే పైకప్పు పెచ్చులూడిపోయి కడ్డీలు బయట కనిపిస్తున్నాయి. గోడలు కూడా కూలిపోతున్నాయి. పాడిరైతులు పశువైద్యశాలకు రావాలంటేనే జంకుతున్నారు. ఈ పశువైద్యశాలకు కొక్కెరంచ, ఎదురుపాడు, నాగంపల్లి, కొత్తమాడుగుల, తదితర గ్రామాలకు చెందిన పశువులు ఆసుపత్రికి రైతులు తీసుకొస్తారు. 180 ఆవులు, 906 గేదెలు, 11వేలకు పైగా గొర్రెలు, మేకలు ఉన్నాయి. నూతన భవనాన్ని నిర్మించాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పశువైద్యాధికారి అశోక్ కుమార్‌ను వివరణ కోరగా భవనం పూర్తిగా శిథిలమైన మాట వాస్తవమేనని, ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వివరించారు.



దుద్యాల పశు వైద్యశాల



వర్షానికి తడిసిపోయిన గోడలు

పశు వైద్యశాలను నిర్మించాలి



దుద్యాల గ్రామ శివారులో ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు గురైంది. వర్షాకాలంలో పెచ్చులూడిపోయి వర్షం నీరు పూర్తిగా కారుతున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదు. దుద్యాల మేజర్ పంచాయతీ కావడంతో సుమారు ఐదారు గ్రామాల రైతులు పశువులను పశువైద్యశాలకు తీసుకొస్తారు. ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడంతో పాడి పశువుల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే శిథిలావస్థకు గురైన భవనం స్థానంలో కొత్తగా పశువైద్యశాలను నిర్మించాలి.

– ఈరగాళ్ల రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుద్యాల

ట్రూ అప్ చార్జీలు రద్దు చేసే వరకు పోరాడుతాం

నందికొట్కూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీలు ఇంధనం సర్దుబాటు చార్జీలు రద్దు అయ్యే వరకు పోరాడుతామని సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఏడీఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నాయకులు గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. పక్కీర్ సాహెబ్ మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.8114కోట్లు, 2023-24 సంవత్సరానికి సంబంధించి విద్యుత్ సర్దుబాటు పేరుతో ప్రజలపై రూ.11వేల కోట్ల భారాన్ని వేయడం సరికాదని అన్నారు. అనంతరం వినతిపత్రాన్ని విద్యుత్ శాఖ ఏ.డీ.ఏ శ్రీనివాసులుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబు, రసీదు, గణేష్, జావీదు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: గత ప్రభుత్వం వివిధ రూపాల్లో ప్రజలపై వేసిన విద్యుత్ భారాలను అధికారంలోకి వస్తేనే తగ్గిమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం పాలకులు ప్రస్తుతం విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం ఏమాత్రం సరికాదని సీపీఎం నాయకులు ఏసురత్నం, రణధీర్, నరసింహనాయక్ పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లను ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే వివిధ రకాల చార్జీలతో జనం బెంబేలెత్తుతున్నారని ఈ పరిస్థితుల్లో విద్యుత్ సర్దుబాటు చార్జీలు మోపడం అన్యాయమని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సురేంద్ర, నాగేశ్వరరావు, సుధాకర్, రవీంద్ర, పక్కీరయ్య తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: ఇంధన సర్దుబాటు విద్యుత్ చార్జీల వసూళ్ళు రద్దు చేయాలని సీపీఎ నాయకులు రామచంద్రుడు, రత్నమయ్య, డేవిడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బండిఆత్మకూరు విద్యుత్‌సబ్‌స్టేషన్ ఎదుట ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేశారు. అనంతరం ఏడీఈ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రం అందజేశారు.



ఏడీఏకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు



విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ

ఆత్మకూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని పలు ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను పరిశీలించారు. అయా దుకాణాల్లోని స్టాక్ నిల్వలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లు ఎప్పటికప్పుడు తమ స్టాక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా బిల్లు పుస్తకంలో రైతు సంతకం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రత్యేకించి ఎరువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా కొనుగోలు చేసిన రైతులకు రశీదులను తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. ఈయన వెంట ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు, ఏవోలు విష్ణువర్ధన్‌రెడ్డి, టెక్నికల్ ఏవో కళ్యాణ్, ఆత్మకూరు, కొత్తపల్లి మండల వ్యవసాయాధికారులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలగకూడదు

పాణ్యం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇబ్బందులు లేకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు శ్రీనివాసులు, మద్దిలేటి కోరారు. గురువారం వారు మాట్లాడుతూ పాణ్యంకు రెండు మద్యం దుకాణాలు మంజూరయ్యాయని, వాటిని ప్రజలకు ఇబ్బందులు లేని చోట ఏర్పాటు చేయాలన్నారు. బస్టాండు సమీపంలోని సచివాలయం సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. సచివాలయం పక్కనే అంగన్ వాడీ కేంద్రం ఉందన్నారు. సచివాలయానికి వచ్చే మహిళలు ఇబ్బందులకు గురవుతారని అన్నారు.

సిబ్బంది సంక్షేమానికి కృషి: ఎస్పీ

నంద్యాల క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పని చేస్తున్న పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ పోలీస్ గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో అయా విభాగాల్లో పని చేస్తున్న పోలీస్ సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్లు, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీలపై పలువురు సిబ్బంది ఎస్పీతో నేరుగా విన్నవించుకున్నారు. సమస్యలకు తగిన పరిష్కారం చూపుతానని ఎస్పీ సిబ్బందికి భరోసా కల్పించారు. సిబ్బంది ఎవరికి ఎలాంటి సమస్య ఉన్నా ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే లో నిర్భయంగా తన దృష్టికి తీసుకురావచ్చని ఎస్పీ సూచించారు. విధి నిర్వహణలో సిబ్బంది సతమతమవకుండా వారి సమస్యలను తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చేయడమే తమ లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

మోటారు వైర్ల దొంగలు దొరికారు..

మిడుతూరు, అక్టోబరు 18 : (ఆంధ్రజ్యోతి): రైతులు ఏర్పాటు చేసుకున్న మోటారు వైర్లు, ఇనుప కడ్డీలను అపహరించుకుపోతున్న దొంగలను అరెస్టు చేశామని ఎస్ఐ ఓబులేసు తెలిపారు. గత కొన్ని నెలల నుంచి గ్రామాల్లో రైతులు పొలాలకు ఏర్పాటు చేసుకున్న మోటారు వైర్లు కడ్డీలను దొంగలిస్తున్న వినవ్ కుమార్, విజవ్ కుమార్, కొమ్ము దిలీప్, విజయ రాజు, వెంకటేశ్వర్లు, రవీంద్రలను గురువారం రాత్రి పట్టుకుని వారి వద్ద ఉన్న టన్ను ఇనుప కడ్డీలను రూ.1.30 లక్ష విలువ చేసే మోటారు వైర్లను, రెండు ఆటోలు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని శుక్రవారం వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపాడు.


జిల్లా ర్యాపిడ్, బ్లిడ్జ్ చదరంగం ఎంపిక పోటీలు

నంద్యాల రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీశాంతి నికేతన్ పాఠశాలలో ఈ నెల 20వ తేదీన నంద్యాల జిల్లా ర్యాపిడ్, బ్లిడ్జ్ విభాగాలలో చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జి రవికృష్ణ, రామసుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. ఎంపికైన జట్లు పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో జరగబోయే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9010451585 నంబర్లను సంప్రదించాలన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

గడివేముల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల రూపకల్పన కోసం పల్లె పండుగకు శ్రీకారం చుట్టిందని మాజీ ఎంపీపీ వంగాల శ్రీనివాసరెడ్డి, పాణ్యం నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. మండలంలోని దుర్వేసి, తిరుపాడు, కొరటమద్ది గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిరిబాబు, నారాయణరెడ్డి, శ్రీనివాసయాదవ్, ఎంపీడీవో వాసుదేవ గుప్త, మండల అధికారులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: రాష్ట్ర ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలకు మహర్దశ పట్టనుందని మండల ప్రత్యేక అధికారి చింతామణి, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో దాసరి మేరీలు అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి, శివపురం గ్రామాల సర్పంచులు లక్ష్మీదేవి, చంద్రశేఖర్ యాదవ్‌ల అధ్యక్షతన పల్లె పండుగ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ కిచ్చెన్నగారి కుసుమలత, మండల కన్వీనర్ నారపురెడ్డి, టీడీపీ మాజీ మండల ప్రెసిడెంటు మల్లారెడ్డి, వైస్ సర్పంచ్ మన్సూర్, నాయకులు నాగేశ్వర యాదవ్, త్రినాథ్ రెడ్డి, మోహన్ యాదవ్, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పీఆర్ ఏఈ మద్దిలేటి, వీఆర్వోలు బాబు మియా, లింగస్వామి పాల్గొన్నారు.



దుర్వేసిలో భూమి పూజ చేస్తున్న నాయకులు

పాములపాడు: మండలంలోని బానకచెర్ల, వేంపెంట గ్రామంలో పల్లెపండుగ- పంచాయతీ వారోత్సవాలను నిర్వహించారు. శుక్రవారం ఎంపిడిఓ చంద్రశేఖర్ టీడీపీ నాయకులు సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజలు నిర్వహించారు కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, ఆదిరెడ్డి, బాలస్వామి, మోహన్‌గౌడ్, పాల్గొన్నారు.

కురుమన్నను మాకు అప్పగించండి

నందికొట్కూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోడలిని అతి కిరాతకంగా చంపిన గొల్ల కురుమన్నను తమకు అప్పగించాలని శిరీష తల్లి శేషమ్మ, తండ్రి రమణయ్య నందికొట్కూరు పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. శిరీష తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమార్తెను కురుమన్న అతి దారుణంగా హత్య చేశారని, ఆయన దొరికాక తమకు అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడి కోసం గాలిస్తున్నామని, నిందితుడికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు.

గ్రామాభివృద్ధికి అధికారులు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

పాములపాడు, అక్టోబరు 18 ఆంధ్రజ్యోతి: మండలంలోని గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం పాములపాడులో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సరోజిని వర్ధినియా అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి శనగలు, మినుములు సిబ్బడీలో పంపిణీ చేస్తున్నామని, వీటిని రైతులు వినయోగించుకోవాలని కోరారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

పాములపాడు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న జాతీయ ఆహార భద్రత మిషన్, పీఎం కిసాన్ పథకాలపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ అన్నారు. శుక్రవారం పాములపాడులో వ్యవసాయశాఖ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, పంట నమోదు, చిరు సంచులు, ఇండిగ్యాప్, పొలంబడి వివిధ పథకాల్లో క్షేత్ర స్థాయిలో జాగ్రత్తగా అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ, మండల వ్యవసాయశాఖ అధికారి ఫణీశ్వరరెడ్డి, ఏవో కళ్యాణ్, ఏఈఓ మద్దిలేటి, రైతు సేవాకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రం తనిఖీ

వెలుగోడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలోని రైతుసేవ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీక్రిష్ణ శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎబిఎస్-8 రకం విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు సాగుచేసే విత్తనాలను ట్రైకోడెర్మా విరిడితో శుద్ధి చేయాలని, రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి పవన్‌కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీని పట్టించుకోరా?

పగిడ్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో నెలల తరబడి పైపులైన్ లీకేజీ అవుతున్నా పట్టించుకోరా అని టీడీపీ నాయకుడు లోకానందరెడ్డి పంచాయతీ కార్యదర్శి వీరన్నను ప్రశ్నించారు. నెహ్రూనగర్ గ్రామంలోని గుండుతూము బడి సమీపంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కాలనీ వాసులు పంట కాల్వలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్ నుంచి నీరు లీకేజీ కావడంతో కలుషితమైన నీటిని ట్యాంకులకు సరాఫరా చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ నీటిని తాగి ప్రజలు రోగాలబారిన పడాల్సివస్తుందని తెలిపారు. రెండు, మూడు రోజులలో సమస్యను పరిష్కరించాలని, లేదంటే సమస్యను కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

చంద్రబాబు సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే బుడ్డా



చంద్రబాబు సదస్సుకు హాజరైన ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో జరిగిన సదస్సుకు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా అక్కడికి వచ్చిన మంత్రులు, సహచర ఎమ్మెల్యేలతో ముచ్చటించారు. కాగా ఈ సమావేశంలో ప్రధానంగా ఎన్డీఏ ప్రభుత్వ విజయాలు, టీడీపీ సభ్యత్వ నమోదు, పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రగతి, పల్లెపండుగ, సూపర్ పాలసీ తదితర అంశాలను సీఎం చంద్రబాబు పార్టీ శ్రేణులకు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : నంద్యాల పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నంద్యాల పట్టణ డీఈఈ రమేష్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మూడో శనివారం సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

చర్మకారుల సమస్యలు పరిష్కరించాలి

-ఏపీ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రెసిడెంట్

నంద్యాల (కల్చరల్), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చర్మకారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ బుల్లా రాజారావు, ఏపీ ఎస్సీ, ఎస్టీ రైట్ ప్రొడక్షన్ కౌన్సిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్వరమ్మ జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుల్లా రాజారావు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో లిడ్‌క్యాప్ సంస్థ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి చర్మకారులకు ఉపాధి కల్పించే మార్గాలను కల్పించాలని జేసీని కోరారు. అలాగే చర్మకారులకు అర్హులైన వారికి పెన్షన్లు, రాయితీలు కల్పించాలని కోరారు.

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : దిగువ అహోబిలంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ మూర్తులకు శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఎదురుగా అర్చకులు హోమ మండపాన్ని ఏర్పాటు చేసి హోమం, పూర్ణాహుతి, మంగళహారతి, తీర్థప్రసాదగోష్ఠి నిర్వహించారు. సాయంత్రం ఉత్సమూర్తులకు శాస్త్రోక్తంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో ఈ పవిత్రోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఫ్రూట్ కేర్ యాక్టివిటీతో మంచి దిగుబడులు

- జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నాగరాజు



ప్యాపిలి: నల్లమేకలపల్లిలో రైతుతో మాట్లాడుతున్న అధికారి నాగరాజు

ప్యాపిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అరటికి ఫ్రూట్‌కేర్ యాక్టివిటీ ప్రక్రియ చేయడం వలన మంచి దిగుబడులు వస్తాయని జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లమేకలపల్లి, హుసేనాపురం, పీఆర్‌పల్లి గ్రామాల్లో ఆయన అరటి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి నాగరాజు మాట్లాడుతూ మంచి దిగుబడులను సాధించేందుకు ఇతర రాష్ట్రాల్లో రైతులు ఫ్రూట్‌కేర్ యాక్టివిటీ పద్ధతిని పాటిస్తున్నారని తెలిపారు. అలాగే మన రాష్ట్రంలో కూడ రైతులకు ఈ పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల ఉద్యాన వనశాఖ అధికారి కళ్యాణి, రైతు సత్యం, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

డోన్ సబ్‌కోర్టు న్యాయాధికారి తంగమణి



మాట్లాడుతున్న న్యాయాధికారి తంగమణి

ప్యాపిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలికలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని డోన్ సబ్‌కోర్టు న్యాయాధికారి తంగమణి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ బాలికల దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ బాలికల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు అమలు చేశాయన్నారు. ఆ చట్టాలను ప్రతి బాలిక తెలుసుకోవాలన్నారు. అలాగే ఉన్నతంగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఆమె సూచించారు. తమకు ఎటువంటి సంఘటనలు ఎదురైన ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ మధుసూదన్, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

నామమాత్రంగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు మల్లికార్జునరావు

రుద్రవరం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశం నామమాత్రంగా కొనసాగింది. ఎంపీడీవో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమంతో గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇన్‌చార్జి ఎంఈవో కోటయ్య, పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజరు లక్ష్మీదేవి , తహసీల్దారు మల్లికార్జునరావు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. పలు శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. సమావేశం లో పీఆర్‌ఏఈ కమాల్‌సాహెబ్, మైనర్ ఇరి గేషన్ ఏఈ రఘురాముడు, ఏపీవో ప్రతాప్, ఇన్‌చార్జి ఎంపీఎం రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పశు వైద్యశాలల ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీడీ

ఉయ్యాలవాడ,అక్టోబరు 18(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ, హరివరం గ్రామాల్లోని పశువైద్య కేంద్రాలను ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డును, సిబ్బంది పని తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 12 మండలాలకు 325 గోకులాలు మంజూరు అయ్యాయన్నారు. వీటికి 800 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. మొదటి విడతలో 19 మందికి ఇచ్చామని ఆయన తెలిపారు. పశు సంవర్ధకశాఖ ద్వారా రైతులకు తక్కువ ధరకే టీఎమ్మార్ దాణా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉయ్యాలవాడ, హరివరం పశువైద్యాధికారులు శైలజ, రవీంద్రారెడ్డి ఉన్నారు.

పథకాలను వెంటనే అమలు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజినేయులు

ప్యాపిలి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్నిల సందర్భంగా ఇచ్చిన సూ పర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజినేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం వచ్చి మూడు నెలల కాలం పూర్తి అయిన ప్రభుత్వం తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల నిధులు అందించకపోవడం విచారకరమన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ఆందోళనలు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమం నాయకులు రాధాక్రిష్ణా, వెంకటేష్, కార్యకర్తలు, హమాలీ, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తోడెండ్లపల్లెలో శ్మశాన స్థలం ఆక్రమణ

- అంత్యక్రియల సమయంలో అవస్థలు
- వంక వెంట పూడ్చుకుంటున్న వైనం
- కొలతలు వేశారు.. వదిలేశారు



తోడెండ్లపల్లెలో మృతదేహంతో వంకను దాటుతున్న దళితులు

చాగలమర్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడెండ్లపల్లె గ్రామంలో దళితులకు కేటాయించిన శ్మశాన స్థలం ఆక్రమణకు గురైంది. దళిత కాలనీలో ఎవరైన మృతి చెందితే అంత్యక్రియలు, మృతదేహాన్ని పూడ్చేందుకు అవస్థలు తప్పడం లేదు. గత ఏడాది సెప్టెంబరు నెలలో గ్రామానికి చెందిన కరకాల మార్క్ మృతి చెందడంతో శవాన్ని పూడ్చడానికి తీసుకెళ్తుండగా ఓ వ్యక్తి ఆ స్థలం తనదని, ఇందులో అంత్యక్రియలు జరనీవ్వనని అడ్డుకున్నాడు. దీంతో దళితులు శవాన్ని తహసీల్దార్ కార్యాలయం వద్దకు తీసుకెళ్లి ధర్నా చేశారు. శ్మశాన స్థల సమస్య పరిష్కరించే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లమంటూ భైఠాయించారు. 98 సర్వే నంబర్‌లో 45 సెంట్ల స్థలాన్ని శ్మశానం కోసం అధికారులు గతంలో కేటాయించారు. ఆ స్థలాన్ని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకున్నారని దళితులు ఆరోపించారు. శ్మశాన స్థలం లేక వంక వెంబడి అంత్యక్రియలు చేయాల్సి వస్తుందని, ఈ సమస్యను పలు మార్లు అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని దళితులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు కొలతలు వేయించి స్థలాన్ని చూపకుండా వదిలేశారు. సమస్యను పరిష్కరిస్తామని చెబుతున్నారే తప్పా పట్టించుకోవడం లేదు. శ్మశాన స్థలాన్ని ఆక్రమించడమే కాక వైసీపీ నాయకుల సహకారంతో కేసులు కూడా నమోదు చేయించారని కొందరు దళితులు ఆరోపించారు. శ్మశాన స్థలం ఆక్రమణలో ఉన్న రెవెన్యూ అధికారులు ఇప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా గెలుపొందడంతో శ్మశాన స్థల సమస్య తీరుతుందన్న ఆశతో ఉన్నారు. శ్మశాన స్థలానికి వెళ్లాంటే రహదారి మధ్యన వంక ఉంది. వంక ప్రవహించే సమయంలో శవాన్ని పూడ్చేందుకు వెళ్లాలంటే నరకయాతన తప్పదు. వంకపై కల్వర్టు నిర్మించి, శ్మశాన స్థల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే, కలెక్టర్‌కు విన్నవించుకుంటున్నామని అన్నారు.

సకాలంలో రుణాలు వసూలు చేయండి



బనగానపల్లెలో మాట్లాడుతున్న వెలుగు పీడీ శ్రీధర్‌రెడ్డి

బనగానపల్లె , అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): సకాలంలో పొదుపు రుణాలు వసూలు చేసి పొదుపు సంఘాలను అభివృద్ధి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి కోరారు. శుక్రవారం వెలుగు కార్యాలయంలో బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ మండలాలకు చెందిన వెలుగు సీసీలు, గ్రామైక్యసంఘం సభ్యులు, బుక్ కీపర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ వెలుగు సీసీలు సక్రమంగా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను కూడా సరిగా మెయింటెన్ చేయడం లేదని నిలదీశారు. రుణాలు ఇవ్వడంలో పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. మహిళలకు రుణాలు అందించడానికి బ్యాంకులు ముందుకు వస్తున్నాయని వాటిని పొదుపు మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలు తీసుకొని జీవనోపాధులు పెంపొందించుకొని ఆర్థికంగా పొదుపు మహిళలు అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, వివిధ మండలాల సీసీలు, బుక్ కీపర్లు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

అవుకు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : ఆధార్ అప్‌డేట్ స్పెషల్ డ్రైవ్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంగన్న శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 22నుంచి 25 వరకు గ్రామాల్లో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నా మన్నారు. ఈనెల 22న సంగపట్నం, అన్నవరం, 23న అవుకు, మెట్టుపల్లె, 24న కునుకుంట్ల, చెన్నంపల్లె, 25వతేదీన ఉప్పలపాడు, మంగంపేట గ్రామాల్లో ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

చాగలమర్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు శుక్రవారం సామూహికంగా భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేశారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. దీపాలు వెలిగిం చి దీపోత్సవం చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి పల్లకి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కొమిలిగుండ్ల ఎంపీడీవో ప్రసాదరెడ్డి

కొలిమిగుండ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పంచాయతీ ఆస్తుల పరిరక్షణకు ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు కలిసి కట్టుగా కృషి చేయాలని ఎంపీడీవో ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ ఉపసర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులను ఎంపీడీవో ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణా తరగతులకు మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు హాజరయ్యారు.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ ఉపసర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల విధులు, బాధ్యతల గురించి వివరించారు. శిక్షకుడు పలుకూరు ఈవో బాలాంజనేయులు ఉపసర్పంచ్, వార్డు సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ పంచాయితీ రాజ్ వ్యవస్థలోని మార్పులను క్షుణ్ణంగా వివరించి శిక్షణ ఇచ్చారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఏఈ వెంకటరమణ, ఈవో ఆర్‌డీ సతీశ్‌కుమార్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ వార్డు సభ్యులు, ఉపసర్పంచ్‌లు బురానుద్దీన్, మౌలీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : ఉప సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని కోవెలకుంట్ల ఎంపీడీవో వరప్రసాద్ అన్నారు. శుక్రవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీకి ఇద్దరు వార్డుమెంబర్లకు రెండురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అశోక్‌రెడ్డి, సురేంద్రనాదరెడ్డి రాజశేఖర్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో 19 గ్రామాలకు చెందిన ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల రీఫ్రెషర్ శిక్షణా కార్యక్రమాన్ని ఎంపీడీవో మంజులవాణి ప్రారంభించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రాజేంద్రప్రసాద్, సీనియర్ సహాయకులు బాల నరసింహులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గ్రామాభివృద్ధి



కలుగొట్లలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

కోవెలకుంట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని టీడీపీ మండల ఉపాధ్యక్షులు గడ్డం అర్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కలుగొట్ల, భీమునిపాడు, కంపమల్ల గ్రామాల్లో పల్లెపండుగ వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, పీఆర్ ఏఈ చెంచయ్యల, సిబ్బంది టీడీపీ నాయకులు కంపమల్ల సుబ్బారెడ్డి, సునీల్‌రెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శిరివెళ్ల, అక్టోబరు: మండలంలోని శిరివెళ్ల, కాదరబాదర, వెంకటేశ్వరాపురం, కోటపాడు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు టీడీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు, అధికారులు శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఖాజా హుసేన్, టీసీ ఫిదా హుసేన్, యామా శ్రీకాంత్, బాలచంద్రుడు, వెంకట సుబ్బయ్య, రాజా, రవి, శ్రీనివాసరెడ్డి, కరీం, అజీస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రుద్రవరం : పల్లెపండుగతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్నట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం రుద్రవరం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగనాయకులు, పోలా గురుమూర్తి, ఏరువ క్రిష్ణమూర్తి, శేఖర్, నంద్యాలపార్లమెంటు ఎస్సీ సెల్ ప్రధానకార్యదర్శి కొమ్ములపాటి రాజారావు, ఏపీవో ప్రతాప్, పీఆర్ ఏఈ కమాల్‌సాహెబ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం, శ్రీను, ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ మండల సీనియర్ నాయకుడు కూడాల నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం సుద్దమల్ల గ్రామంలో ఎంపీడీవో ఉమమహేశ్వరరావుతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లె బాబుల్‌రెడ్డి, మారంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చెన్నకేశవరెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటయ్య, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు, ఉపాధి ఏపీవో రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: గ్రామాల అభివృద్ధికే ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మంజులవాణి తెలిపారు. శుక్ర వారం మండలంలోని పెద్దబోదనం, చిన్నబోదనం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు శజ్జారెడ్డి, రమణారెడ్డి, కుమార్‌రెడ్డి, ఏఈ కొండారెడ్డి, ఏపీవో నిర్మల, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

దొర్నిపాడు: టీడీపీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అర్జునాపురం సర్పంచ్ భూమా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అర్జునాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీడీవో సావిత్రి, ఈవోపీఆర్డీ సులోచన, టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, బాబయ్య, హర్షవర్ధన్‌రెడ్డి, శివకోటిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో గంగన్న, సోమశేఖర్, సిబ్బంది ఉన్నారు.

బేతంచెర్ల: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, అంబాపురం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ భూమి చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాష్‌బాబు, పీఆర్ ఏఈ మహేష్, ఆర్‌డబ్లూసీ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని కోరుమానుపల్లె, తోళ్లమడుగు, ఉమ్మాయిపల్లె గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు టీడీపీ నాయకులు కోరుమానుపల్లె నరసింహారెడ్డి, ఓబయ్య, ఉమ్మాయిపల్లె గోపాల్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గట్టు నారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, పాల హుసేని, ఉమ్మాయిపల్లె రామానాయక్, రమణయ్య, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

అవుకు : మండలంలోని రామాపురం, చెర్లోపల్లె, సంగపట్నం, వేములపాడు గ్రామాల్లో ఎంపీడీవో వెంగన్న ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ రామక్రిష్ణారెడ్డి, బోరెడ్డి భాస్కర్‌రెడ్డి, పక్కీరగౌడు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, చక్రీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలోని వెంకటాపురం, చెర్వుపల్లె, బీరవోలు, రామతీర్థం గ్రామాల్లో ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, అధికారులు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు గడ్డం నాగేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ మద్దిలేటి, శరత్, రామతీర్థంలో మద్దిలేటి, ఏఈలు వెంకటరమణ, ఏపీవో రేష్మా, టీఏ మగ్బుల్‌హుసేన్, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.



శిరివెళ్లలో భూమిపూజ చేస్తున్న టీడీపీ నాయకులు



ఉయ్యాలవాడ: రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

విద్యుత్ భారాన్ని మోపడం తగదు: సీపీఎం



బేతంచెర్లలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

డోన్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ పేరుతో ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపడం తగదని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్, సీనియర్ నాయకులు శివరాం, చిన్న రెహిమాన్ అన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో పెంచుతున్న విద్యుత్ చార్జిలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో కార్యకర్తలు ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు నక్కి హరి, నాగమద్దయ్య, అశోక్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు వద్దని, సర్దుబాటు చార్జీల వసూలు నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి మధుశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మండలంలోని డోన్ రోడ్డులోని విద్యుత్ శాఖా కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం విద్యుత్ ఏఈకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, ఎల్లరాజు, రాజబాబు, వెంకటేశ్వర్లు, బాషా, వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి సత్కారం



నబీరసూల్‌ను సత్కరిస్తున్న కర్నూలు బెటాలియన్ పోలీసు అధికారులు

డోన్ రూరల్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): డోన్ మండలం కొత్తపల్లి గ్రామ టీడీపీ నాయకులు కొత్తపల్లి గ్రామ సేవా సమితి నాయకులు నబీ రసూల్‌ను కర్నూలు బెటాలియన్ పోలీసు కార్యాలయంలో ఘనం గా సత్కరించారు. కొత్తపల్లి గ్రామ సేవా సమితి పేరుతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. దానిని గుర్తించి కర్నూలు బెటాలియన్ పో లీసు అధికారులు మహబూబ్ బాషా, ఫకృద్దీన్, సుధాకర్ రెడ్డి సన్మా నించి మొక్కను అందజేశారు.

దైవ ప్రార్థన మరువద్దు

రుద్రవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ప్రయాణానికి ముందు హెల్మెట్ ,సీటుబెల్టు, దైవ ప్రార్థన మరువద్దని ఆటో యాత్రికుడు అబ్దుల్‌గఫార్ అన్నారు. శుక్రవారం చిత్తరేణిపల్లె, ముకుందాపురం ఇంకా పలు గ్రామాల్లో ఆటో యాత్ర నిర్వహించారు. ఆటో యాత్రలో భాగంగా అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రతి పనికి ముందు దైవప్రార్థన చేసుకోవాలన్నారు.

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాగలమర్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చక్రవర్తు లపల్లె, డి.వనిపెంట, కొత్తపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాలు భారీ వర్షాలకు నీట మునిగి దెబ్బతి న్నాయి. భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన ఏవో రంగనేతాజీ శుక్రవారం ఆయా గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని అన్నారు. ఆయన వెంట వీఏఏలు, వీహెచ్‌ఏలు ఉన్నారు.

భారీ వర్షాలకు కూలిన మట్టి మిద్దెలు

చాగలమర్రి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన భారీ వర్షాలకు ఆయా గ్రామాల్లో మట్టిమిద్దెలు కూలాయని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చిన్నవంగలి, తోడెండ్లపల్లె, మల్లేవేముల, చాగలమర్రి, గొడిగనూరు తదితర గ్రామాల్లో 16 మట్టిమిద్దెలు కూలిపోయాయని తెలిపారు. ఆయా గ్రామాల వీఆర్వోలు నివేదికలను అందజేశారన్నారు. బాధిత కుటుంబాలకు పరిహారం కోసం కలెక్టర్‌కు ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు ఉన్నారు.

మృతుడి నేత్రాలు దానం

బేతంచెర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన నాగేశ్వరరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. మృతుడి నేత్రాలు మట్టిపాలు కాకుండా కుటుంబ సభ్యులు లైఫ్ యువ నేత్ర సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే కర్నూలు ప్రభుత్వ నేత్రాలయానికి చెందిన టెక్నీషియన్ గంగాధర్ మృతుడి నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు లతా, వనిత, సుమిత్ర, నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, లైఫ్ యువనేత్ర సేవా సమితి సభ్యులు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

'లైఫ్ యువ నేత్ర'కు రాష్ట్ర స్థాయి అవార్డు

బేతంచెర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): లైఫ్ యువనేత్ర సేవా సమితికి రాష్ట్ర స్థాయి అవార్డును హైదరాబాదు ఎల్వీ ప్రసాద్ శుక్రవారం అందజేసినట్లు సభ్యులు తెలిపారు. బేతంచెర్లకు చెం దిన లైఫ్ యువ నేత్ర సేవా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 364 మందితో నేత్రదానం చేయించడంతో శుక్రవారం ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ అధినేత జీఎన్ రావు రాష్ట్ర స్థాయి అవార్డును అందజేశారు. లైఫ్ యువ నేత సభ్యులు పవన్ కుమార్, అక్బర్ హుశేన్, విజయేంద్రరెడ్డిలను సన్మానించారు. కార్యక్రమంలో లైఫ్ యువ నేత్ర సేవా సమితి సభ్యులు ఎల్వీ ప్రసాద్, ఇన్‌స్టిట్యూట్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె , అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన బనగానపల్లె మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో చోటు చేసుకున్నది. శుక్రవారం నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుబ్బిశెట్టికిరణ్ (35) అధికంగా మద్యానికి బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించింది. దానికి తోడు అప్పులు అధికం అయ్యాయి. దాంతో కళాపి పౌడర్ తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య ప్రేమమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన బస్సు

డోన్ రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం కొత్తపేట రైల్వేగేట్ల సమీపంలో ఓ పెళ్లి బృందం బస్సు ప్రమాదవశాత్తున కరెంటు పోల్‌ను ఢీకొంది. దీంతో కరెంటు పోల్ విరిగి పడింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. ట్రాన్స్‌కో అధికారులు అప్రమత్తమై పరిసర ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివేసి కరెంటు పోల్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ ఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

వైభవంగా పల్లకీ సేవ

బనగానపల్లె , అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం శ్రీచౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం శ్రీ చౌడేశ్వరీమాత పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో కామేశ్వరమ్మ, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

డోన్ రూరల్ అక్టోబరు 18, (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్ ప్రాంగణంలో బస్సు ప్రమాదానికి గురైన విద్యార్థినికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం చెల్లించాలని ఎస్‌ఎస్‌యూఐ నాయకులు తెలుగు విజయకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.